ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శనివారం 19 అక్టోబరు 2024


నంబులపూలకుంట మండలంలో తడిసిన వేరుశనగ పంటను చూపుతున్న రైతులు


వర్షార్పణం..!

13 మండలాల్లో
వాన ప్రభావం..
186.4 హెక్టార్లలో పంట నష్టం

పుట్టపర్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలు.. జిల్లాలో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపాయి. పంటనష్టంపై వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. ఈనెల 13 నుంచి శుక్రవారందాకా కురిసిన వర్షాలకు జిల్లాలో 186.4 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. 184 హెక్టార్లలో వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. 2.4 హెక్టార్లలో ఉద్యాన పంటలైన టమోటా, అరటి, బంతి పూలు, వంగ పంటలు దెబ్బతిన్నాయి. పంట కోత దశలో ఉన్న వేరుశనగ 166, వరి 33, పత్తి 10, కంది 14, చిరుధాన్యాలు 9, మొక్కజొన్న హెక్టారులో నష్టం వాటిల్లింది. బుక్కపట్నం, కొత్తచెరువు, పరిగి, మడకశిర, రొళ్ల, పెనుకొండ, రొద్దం, కదిరి, తనకల్లు, నంబులపూలకుంట, తలుపుల, పుట్టపర్తి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో పంట నష్టం వాటిల్లింది. మంగళవారం నుంచి శుక్రవారం దాకా వర్షం కురిసింది. 16న జిల్లాలో 32 మండలాల్లో 1132 మి.మీ, గురువారం 1745.4 మి.మీ, శుక్రవారం 447 మి.మీ, వర్షపాతం నమోదైంది. ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందనీ, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలను అప్రమత్తం చేశారు. ముందస్తు హెచ్చరికలు, జాగ్రత్తలతో అన్ని విభాగాలను అప్రమత్తం చేశారు. దీంతో భారీ వర్షాలు కురిసినా పంట నష్టం పెద్దమొత్తంలో వాటిల్లకుండా నివారించగలిగారు. పంటనష్టంపై ప్రాథమిక అంచనా ప్రకారం కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి సుబ్బారావు వెల్లడించారు.


కుళ్లిన వేరుశనగ కట్టెని చూపుతున్న నల్లమాడ మండలం తిప్పయ్యగారిపల్లి రైతు భాస్కర్‌రెడ్డి





పసిప్రాణాలతో చెలగాటం

అంగన్‌వాడీ కేంద్రంలో భయం.. భయం..


అంగన్‌వాడీ కేంద్రం పక్కనే కూలిన తహసీల్దార్ కార్యాలయ భవనం


వర్షానికి కారిన అంగన్‌వాడీ కేంద్రం

కొత్తచెరువులోని పాత తహసీల్దార్ భవనం పక్కనే అంగన్‌వాడీ కేంద్రం ఉంది. అందులో ఒకే గదిలో ఏకంగా నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. 60 మంది చిన్నారులు రోజూ వస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అంగన్‌వాడీ భవనం కారుతోంది. అందులో పెద్దఎత్తున నీరు చేరుతోంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి ఆనుకునే పాత తహసీల్దార్ కార్యాలయ భవనం ఉంది. ప్రస్తుతం వినియోగంలో లేదు, పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దానిపై పెద్ద రావిచెట్టు పెరిగింది. వరుస వర్షాలకు ఈ భవనం పూర్తిగా దెబ్బతిని, గురువారం రాత్రి పాక్షికంగా కూలింది. ఏ క్షణంలోనైనా పూర్తిగా కూలిపోవచ్చు. అక్కడే అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలు ఆడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఏ సమయంలో ఎప్పుడు, ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అంగన్‌వాడీకి పంపాలంటేనే జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత తహసీల్దార్ కార్యాలయ భవనంపై పెరిగిన రావిచెట్టును, పాతబడిన భవనాన్ని తొలగించాలని వారు కోరుతున్నారు.

-కొత్తచెరువు, ఆంధ్రజ్యోతి

వీడని ఉత్కంఠ

పలుచోట్ల తెరుచుకోని మద్యం దుకాణాలు

పుట్టపర్తి, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాలు ఇంకా కొన్ని చోట్ల ప్రారంభం కాలేదు. జిల్లాలో 87 మద్యం దుకాణాలకు లాటరీతో లైసెన్సులు మంజూరు చేశారు. వాటిలో ఇంకా 13 చోట్ల ప్రారంభించలేదు. మద్యం దుకాణాలు దక్కించుకున్న వారిలో కొంతమంది బుధవారం నుంచే విక్రయాలు ప్రారంభించారు. గురు, శుక్రవారాల్లో అత్యధికంగా తెరుచుకున్నాయి. ముదిగుబ్బ, హిందూపురం పట్టణం, రూరల్, పరిగిలో రెండు చొప్పున, రెండు, బత్తలపల్లి, తాడిమర్రి, సోమందేపల్లి, పెనుకొండ రూరల్, ఎస్ఎస్ గేటు, అమరాపురం, మడకశిర రూరల్ ఒకటి చొప్పున ప్రారంభం కాలేదు, కొన్నిచోట్ల భవనాలు దొరక్క ఆలస్యమవుతోంది. పార్టీలతో సంబంధంలేని వ్యాపారులకు దుకాణాలు దక్కిన చోట రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నట్లు తెలుస్తోంది. తమ ప్రాంతాల్లో తమకే వదిలిపెట్టాలని కూటమి పార్టీల నేతలు బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంతో కొంత తీసుకుని దుకాణాలు వదులుకోవాలనీ, లేదంటే తమ అనుచరగణానికి వాటా ఇవ్వాల్సిందేననీ, వాటికి ఒప్పుకోకుంటే వ్యాపారం చేయలేరని హెచ్చరికలతో బేరసారాలు సాగిస్తున్నారు. ఈనేపథ్యంలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారిలో కొందరు ప్రారంభించలేకపోతున్నట్లు తెలుస్తోంది. ఎక్సైజ్ శాఖ మాత్రం జిల్లాలో అన్ని ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ప్రారంభించి, విక్రయాలు సాగిస్తున్నట్లు చెబుతోంది.
















పురాతన భవనం

నాణ్యతకు నిదర్శనం

వందేళ్లయినా చెదరని భవన నిర్మాణం

ఉరవకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కట్టిన ఐదారేళ్లలోనే కూలిపోతున్న లేదా దిబ్బ తింటున్న ప్రభుత్వ భవనాలు కొన్ని మనకు కనిపిస్తూనే ఉన్నాయి. అయితే వందేళ్లు దాటినా చెక్కు చెదరకుండా నాణ్యమైన నిర్మాణానికి నిదర్శనంగా నిలుస్తోంది ఉరవకొండలోని తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని భవనం. దీన్ని స్వాతంత్ర్యానికి పూర్వం 1910లో నిర్మించారు. గోడలను రాళ్లతో నిర్మించి, పైకప్పు పెంకులతో వేశారు. బ్రిటిష్ వారి పాలనలో నిర్మించిన ఈ భవనాన్ని 2012 వరకూ తహసీల్దారు కార్యాలయంగా వాడుకునేవారు. ప్రస్తుతం ఈ భవనాన్ని వీఆర్వోలు వినియోగిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ఆర్కిటెక్ అధికారులు ఈ భవనాన్ని పరిశీలించారు. 114ఏళ్ల కిందట నిర్మించినప్పటికీ ఈ భవనం పటిష్టంగా ఉందని తెలిపారు. నిస్వార్థంగా కడితే ఏ కట్టడమైనా ఇలాగే పటిష్టంగా ఉంటుందని ఇక్కడికి వచ్చిన వారు పేర్కొంటున్నారు.

పుష్ప విలాపం

- వర్షాలకు దెబ్బతిన్న బంతిపూలు
- తగ్గిన ధరలతో రైతుల దిగాలు

బొమ్మనహాళ్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వరుసగా కురుస్తున్న వర్షాలతో పూల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని మండలంలో బంతిపూలను విస్తారంగా సాగు చేశారు. దసరా తరవాత ధరలు తగ్గి నష్టాలు వచ్చాయి. మండలంలోని దేవగిరి, దేవగిరి క్రాస్, ఉంతకల్లు తదితర గ్రామాల్లో బంతి పూలు సాగు చేశారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న జడివానకు పూసిన పూలన్నీ కుళ్లిపోతున్నాయి. ఐదు రోజుల కిందట కిలో రూ. 100 పలికిన ధర ప్రస్తుతం కొనేవారు లేక నేల చూపులు చూస్తోంది. దీంతో రైతులు బళ్లారి మార్కెట్టుకు తరలిస్తున్నారు. అక్కడ కిలో రూ.40, రూ.50కు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. కూలీలు, రవాణా ఖర్చులు కూడా రావడం లేదని వాపోతున్నారు.


విరబూసిన పూదోట

రోడ్డు ప్రమాదంలో మెడికో మృతి


చైతన్య (ఫైల్)

ఉరవకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపిడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ నర్రా రాకేశన్న తనయుడు నర్రా చైతన్య(23) బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నర్రా చైతన్య కర్ణాటకలోని శివమొగ్గలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. పీజీ సీటు వివరాల కోసం బెంగళూరుకు వెళ్లాడు. ద్విచక్రవాహనంపై శుక్రవారం ఉదయం వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన చైతన్యను ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో అతడి తల్లిదండ్రులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

రేపు విమలాశాంతి పురస్కార సభ

అనంతపురం కల్చరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విమలా శాంతి సాహిత్య సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం కవితా పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీఓ హోంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ శాంతినారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లాకు చెందిన లేదాళ్ల రాజేశ్వరరావుకు పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. సాహిత్యాభిమానులు హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు.

పొరపాటు పడేరు..!

ఇవి.. భోజనానికి ఏర్పాటు చేసిన ప్లేట్లు కాదు


ఎంఈఓ కార్యాలయంలో వర్షపు నీరు ఫ్లోర్‌మీద పడకుండా ఏర్పాటు చేసిన ప్లేట్లు

కుందుర్పి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఇవేవో అతిథులు భోజనం చేయడానికి ఉంచిన ప్లేట్లు కాదు. వాన నీళ్లు కింద పడకుండా చేసిన ఏర్పాట్లు. వానొస్తే భవనమంతా కారుతుండటంతో ఎంఈఓ కార్యాలయ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయమంతా తడి కాకుండా ఉండటం కోసం ఇలా ప్లేట్లు, జగ్గులు ఉంచుతున్నారు. మండల విద్యాధికారి, సిబ్బంది వర్షాకాలం వస్తే చాలు ఇలా ఇబ్బంది పడుతూ విధులు నిర్వహించాల్సిన దుస్థితి.

రీ సర్వేతో రికార్డుల్లో భూమి మాయం

రెవెన్యూ సదస్సులో అధికారులకు రైతు ఫిర్యాదు


బాధిత రైతు బసంపల్లి మల్లేష్


రీసర్వే కన్నా ముందు మల్లేష్ పట్టాదారు పాసుపుస్తకం

శెట్టూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రీసర్వే అనంతరం రికార్డులలో తన పేరుమీద ఉన్న భూమి కనిపించడం లేదని మండలంలోని బసంపల్లికి చెందిన రైతు మల్లేష్ పేర్కొన్నాడు. ఈమేరకు శుక్రవారం శెట్టూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టిని కలిసి ఫిర్యాదు చేశాడు. శెట్టూరు రెవెన్యూ గ్రామంలో సర్వేనెంబర్ 46లో 52 ఎకరాల విస్తీర్ణం ఉంది. అందులో మల్లేష్‌కు చెందిన 4.28 పొలం రెవెన్యూ రికార్డుల్లో ఉండాలి. కానీ నాలుగు సెంట్లు మాత్రమే రికార్డుల్లో కనబడుతోందని, మిగిలిన 4.24 ఎకరాలు కనిపించడం లేదన్నారు. న్యాయం చేయాలని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగిన ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. రీసర్వే అనంతరం తనకు రెవెన్యూ రికార్డులు, 1బి కానీ, అడంగల్ కానీ రావడం లేదన్నారు. దీంతో ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులైన స్పందించి తనకు భూమి రెవెన్యూ రికార్డుల్లో పొందుపరచాలని ఆయన కోరారు.

కల్తీ కేసులో ఆరు నెలల జైలు

పండ్ల వ్యాపారికి శిక్ష... రూ.50 వేలు జరిమానా కూడా


అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): పండ్ల అమ్మకాలలో కల్తీ చేసిన పాపానికి ఓ వ్యాపారి జైలు పాలయ్యాడు. 2015 ఆగస్టు 25న ఫుడ్ సేఫ్టీ అధికారి నాగేశ్వరరావు నగరంలోని మార్కెట్ యార్డులో తనిఖీలు జరిపినట్లు జిల్లా ఆహారభద్రత శాఖాధికారి తస్లీమ్ తెలిపారు. మార్కెట్ యార్డులో బైగారి అశ్వత్థరెడ్డి అనే వ్యక్తి కార్బైడ్‌తో మాగించిన రేగు పండ్లను విక్రయిస్తున్నట్లు గుర్తించారన్నారు. వాటి శాంపిళ్లను రాష్ట్ర ఆహారభద్రత ల్యాబ్‌కు పంపించామన్నారు. పండ్లకు కార్బైడ్ కలిపి అమ్మకాలు జరిపినట్లు నిర్ధారణ అయిందన్నారు. దీంతో నగరంలోని కోర్టులో బైగారి అశ్వత్థరెడ్డిపై కేసు నమోదు చేయించారన్నారు. విచారణ అనంతరం శుక్రవారం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి శివశంకర్ దోషిగా తేలిన అశ్వత్థరెడ్డికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.50వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.

ప్రజారోగ్యంతో చెలగాటమాడితే చర్యలు తప్పవ్...

- ఆహార భద్రత శాఖాధికారి తస్లీమ్

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడాలని చూస్తే కఠిన చర్యలు తప్పవు. ఆహార కల్తీలకు పాల్పడితే బైగారి అశ్వత్థరెడ్డి మాదిరే జైలుపాలు కావాల్సి వస్తుంది. ఆహార పదార్థాలకు సంబంధించి వ్యాపారస్తులు నిబంధనలు పాటించాలి. ఎలాంటి కల్తీలకు తావులేకుండా చూసుకోవాలి. హోటళ్లు తమ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు.. ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి. తనిఖీల సమయంలో ఏవైనా కల్తీలు జరిగినట్లు తెలిస్తే... శాంపిల్స్ రిజల్ట్ అనంతరం కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వ్యాపారస్తులు జాగ్రత్తలు తప్పక పాటించాలి.

ఇసుక, మద్యంలో వేలు పెట్టొద్దు


మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

- ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు తెస్తే ఉపేక్షించను
- పనితీరుపై పార్టీవర్గాల సర్వే ఉంటుంది
- ప్రజల్లో విశ్వసనీయత పొందండి
- టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హితబోధ

అనంతపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలను విధ్వంసం చేశారు. ప్రజలు అందుకే ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి. గత వైసీపీ పాలనలోలాగా ఎవరూ ఇసుక, మద్యం వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దు. ఆ విధంగా ఎవరైనా జోక్యం చేసుకుంటే సహించేది లేదు. ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డ పేరు తీసుకొచ్చే విధంగా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించేది లేదు' అని టీడీపీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత పార్టీ ప్రజాప్రతినిధులకు హితబోధ చేశారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో చంద్రబాబునాయుడు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి మినహా ఉమ్మడి జిల్లాకు చెందిన ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కాగా ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ఏ విధంగా నడుచుకోవాలి..? ఏఏ విషయాల్లో జోక్యం చేసుకోకూడదు..? ప్రభుత్వ పనితీరు, ప్రజల సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి ఏ విధంగా తీసుకువెళ్లాలి..? ఎమ్మెల్యేలుగా ప్రజల విశ్వాసాన్ని ఏ విధంగా పొందాలి..? నాయకులు, కార్యకర్తలు, ప్రజలను ఏ విధంగా అనుసంధానం చేసుకొని పార్టీని మరింత బలోపేతం ఎలా చేయాలి..? తదితర అంశాలపై చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

సంకేతాలు వస్తున్నాయ్.. సరిచేసుకోండి

గడిచిన నాలుగు నెలల కాలంలో కొందరు ఎమ్మెల్యేల వ్యవహార శైలి సరిగా లేదన్న సంకేతాలు వచ్చాయ్. వాటిని సరిచేసుకొని ప్రజల్లో విశ్వసనీయత పొందే విధంగా నడుచుకోవాలని హితవు పలికారు. ఎక్కువ శాతం తొలిసారిగా ఎమ్మెల్యేలుగా గెలుపొందిన నేపథ్యంలో ఎమ్మెల్యేగా, మంచి రాజకీయ నాయకుడిగా విశ్వసనీయత పొందాలంటే సమయం పడుతుందన్న విషయాన్ని గ్రహించాలన్నారు. అలా కాకుండా ఎమ్మెల్యేగా అయిపోయాం.. ఇక మాకు ఎదురులేదనే విధంగా వ్యవహరిస్తే ఒక్క నిమిషంలోనే విశ్వసనీయతను కోల్పోతారన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని చంద్రబాబు హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వాస్తవాలకు దగ్గరగా నిర్ణయాలు తీసుకుంటున్న నేపథ్యాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి ఎమ్మెల్యేపై ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. అధికారంలోకి వచ్చాం కదా అని వైసీపీ నాయకుల్లాగా వ్యవహరిస్తే ప్రజలు గుర్తుపెట్టుకుంటారన్న విషయాన్ని ప్రతి ఎమ్మెల్యే గ్రహించాలన్నారు. పార్టీ భవిష్యత్‌ను కాపాడే విధంగా ఎమ్మెల్యేలు నడుచుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు ప్రజల్లో మరింత గౌరవాన్ని పొందేలా పనిచేయాలని సూచించారు. గత ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు విషయంలో అనేక సర్వేలు చేసిన తర్వాతనే అభ్యర్థులను ప్రకటించామన్నారు. ఎమ్మెల్యేలు గా గెలుపొందిన తర్వాత వారి పనితీరుపైనా పార్టీ నిఘా వర్గాల ద్వారా నిరంతరం సర్వే కొనసాగుతుందన్నారు. ఎక్కడా ఎలాంటి వివాదాంశాల్లోకి తలదూర్చినా, పార్టీ నిఘా వర్గాల ద్వారా తనకు సమాచారం అందుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఎంపీ, ఎమ్మెల్యేలను హెచ్చరించారు.


మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

గడువు పొడిగింపు

అనంతపురం విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు 2024-25 విద్యా ఏడాది గడువు పొడిగించినట్లు డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుం లేకుండా ఈనెల 25 వరకూ ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందవచ్చునన్నారు. రూ. 200 అపరాధ రుసుంతో ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకూ అడ్మిషన్లు పొందవచ్చునన్నారు. రూ. 500 అపరాధ రుసుంతో ఈనెల 30,31వ తేదీల్లో అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా జడ్పీ సర్వసభ్యసమావేశం శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక రెండోసారి జడ్పీ సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నారు. తొలి సమావేశానికి కొత్తగా ఎంపికైన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధులు పెద్దగా హాజరు కాలేదు. దీంతో ఈ దఫా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దీనికితోడు మెజార్టీ ప్రభుత్వశాఖల్లో ఉన్నతాధికారుల నుంచి ఎగ్జిక్యూటివ్ లైన్‌లోని ప్రధాన అధికారులంతా చాలా మంది ఇటీవల బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు శాఖల్లో కొత్త అధికారులు వచ్చారు. ఈ ప్రభావం కూడా కొంత సమావేశంపై ఉండే అవకాశం ఉందన్న చర్చ నడుస్తోంది. ఈ సారైనా జిల్లాలో నెలకొన్న ప్రధాన సమస్యలపై పూర్తి స్థాయిలో చర్చ సాగిస్తారో... మమ అనిపిస్తారో చూడాలి.

ఓ పనైపోయింది..!

- కేజీబీవీ ఉద్యోగార్థులకు ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన
- 334 మందిలో 239 మంది హాజరు

అనంతపురం విద్య, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో ఉద్యోగాలకు దరకాస్తు చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన ముగిసింది. ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం సర్టిఫికెట్ల స్క్రూటినీ నిర్వహించారు. ఏపీసీ నాగరాజు, డిప్యూటీ డీఈఓ శ్రీదేవి, జీసీడీఓ ఇతర సమగ్రశిక్ష అధికారులు సుమారు 10 బృందాల అధికారుల ఆధ్వర్యంలో అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ఉదయమే ప్రాజెక్టు కార్యాలయానికి అభ్యర్థులు చేరుకున్నారు. చంటిపిల్లలతో హాజరైన తల్లులు కొందరు ఇబ్బంది పడ్డారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రావాలని 334మంది అభ్యర్థులకు సమాచారం అందించగా... 239 మంది హాజరైనట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ప్రక్రియ ముగిసిందని, గైర్హాజరైన అభ్యర్థులకుస్క్రూటినీ ఉండదని సమాచారం.


సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఏపీసీ నాగరాజు తదితరులు


చంటి బిడ్డలను లాలిస్తున్న అభ్యర్థుల బంధువులు

నేడో.. రేపో.. కలెక్టర్ చెంతకు...

సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న అభ్యర్థుల వివరాలను ప్రాజెక్టు అధికారులు శనివారం క్రోడీకరించే అవకాశం ఉంది. హాజరైన అభ్యర్థులు, వారి అర్హతలు, అనుభవం, రోస్టర్ తదితర వివరాలను క్రోడీకరించి సంబంధిత ఫైల్‌ను శనివారం లేదా ఆదివారం జిల్లా కలెక్టర్‌కు పెట్టనున్నట్లు సమాచారం. కలెక్టర్ నుంచి ఆమోదం లభించగానే... అర్హులను ఎంపిక చేసి నియామక ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారుల నుంచి స్పష్టమవుతోంది.

టీచర్ల సీనియారిటీ జాబితా విడుదల చేయాలి


ఆర్జేడీకి వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను విడుదల చేయాలని ఎస్టీయూ నాయకులు ఆర్జేడీ శామ్యూల్‌ను కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆర్జేడీని కలిశారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ టీచర్ల సీనియారిటీ జాబితాను, జిల్లా పరిషత్, ప్రభుత్వ యాజమాన్య టీచర్ల రెగ్యులరైజేషన్, సీనియారిటీ జాబితాలను అన్ని డీఎస్సీల టీచర్లకు తయారు చేయాలని ఆర్జేడీకి వినతిపత్రం అందించారు.

ఆర్జేడీని కలిసిన ప్రైవేట్ స్కూల్‌యూనియన్ నేతలు

కడప ఆర్జేడీ శామ్యూల్‌ను అనంతపురం ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు కలిశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి రమణారెడ్డి, సీఆర్వో రవిచంద్రారెడ్డి, నగర ప్రధానకార్యదర్శి విజయ్‌కుమార్ ఇతర నాయకులు ఆర్జేడీని కలిసినవారిలో ఉన్నారు.

డీఎడ్ కళాశాల అక్రమాలపై విచారణ


విచారణ చేస్తున్న ఆర్జేడీ కార్యాలయ సిబ్బంది

అనంతపురం విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బుక్కరాయ సముద్రంలోని విజయభారతి డీఎడ్ కళాశాలలో జరిగిన అక్రమాలపై ఆర్జేడీ కార్యాలయ అధికారులు విచారణ చేశారు. పాత డీఈఓ ఆఫీస్‌లో ఆర్జేడీ శామ్యూల్, ఏడీ అరుణ్, ఏసీ గోవింద్‌నాయక్‌తో కలిసి డైట్ కళాశాల సిబ్బందిని శుక్రవారం విచారించారు. కళాశాల యాజమాన్యం మారిన నేపథ్యంలో నూతన యాజమా న్యం విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో కలెక్టర్, ఆర్జేడీ, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో విచారణకు ఆదేశించారు. విద్యార్థులను కూడా పిలిపించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

రేపు అంకురం వేడుకలు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): త్యాగరాజ సంగీత సభ ఆధ్వర్యంలో ఆదివారం అంకురం శాస్త్రీయ సంగీత నృత్య వేడుకలు నిర్వహించనున్నట్లు సంగీతసభ అధ్యక్షుడు ఎన్‌సీ సంపత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేరళకు చెందిన అలా వేణుగోపాల్‌తో పాటు వివిధ ప్రాంతాల కళాకారులచే ఆదివారం సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు శాస్త్రీయ, సంగీత నృత్య వేడుకలు నిర్వహిస్తామన్నారు. కళాకారులు, కళాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ సమైక్యత శిబిరానికి మెడికోలు


మెడికోలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు

అనంతపురం టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యత శిబిరానికి అనంతపురం మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు శుక్రవారం తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జానకి, దివ్యతేజ్, దివ్య షెకావత్ ఈ నెల 21 నుంచి 27 వరకు హరియాణాలోని ఇందిరాగాంధీ యూనివర్సిటీలో జరిగే శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. కేంద్ర యువజన సర్వీసుల క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య యూనివర్శిటీ తరఫున అనంత మెడికోలు ఎంపికైనట్లు తెలియజేశారు. మెడికోలను ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ పరదేశీనాయుడు అభినందించారు.

పని ఒకటి... బిల్లు మరొకటి

- ఇంటిపేరుతో బిల్లు పెట్టి.. అద్దె భవనం రీమోడలింగ్
- జగనన్న ఇళ్ల నిర్మాణంలో అంతులేని అవినీతి
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

విడపనకల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జగనన్న ఇళ్ల నిర్మాణంలో అంతులేని అవినీతి జరిగింది. మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణం చేయకపోయిన వైసీపీ నాయకులు చెప్పిన వారికి హౌసింగ్ అధికారులు బిల్లులు మంజూరు చేశారు. మండల కేంద్రంలో ఉన్న కెనరా బ్యాంక్‌ను వైసీపీ పాలనలో రీ మోడలింగ్ చేయించారు. దానికి పెట్టిన ఖర్చంతా ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న ఇంటి బిల్లులే అని తేలింది. వలిపిరెడ్డి గారి లక్ష్మి నరసమ్మ ఇంటి ఐడీ నంబరు: 120310ఎస్‌పీఐ1165442, వలిపిరెడ్డి లావణ్య రెడ్డి ఇంటి ఐడీ నంబరు: 120310ఎస్‌పీఐ1328252 కుటుంబ సభ్యుల పేర్లు మీద రెండు జగనన్న బిల్లులు మంజూరు చేశారు. వీరికి సంబంధించిన ఓ ఇంటిని కెనరా బ్యాంక్‌కు అద్దెకు ఇచ్చారు. దాన్ని రెండు జగనన్న ఇంటి బిల్లులు మంజూరు చేయించుకుని రీ మోడలింగ్ చేయించారు. వీరికి బ్యాంకు వారు నెలకు రూ.40వేలు అద్దె ఇస్తున్నారు. రీమోడలింగ్ అనంతరం అద్దె రూ. 50వేలు పైనే చెల్లిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై గతంలో దండోర జిల్లా కార్యదర్శి కెంగూరి ఎర్రిస్వామి తహసీల్దారు ఈరమ్మకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారుల్లో చలనం లేదు.


రూఫ్‌లెవెల్ కనిపిస్తున్న పేర్లు


కంప్లీట్ లిస్టులో పేర్లను కనిపించకుండా చేసిన అధికారులు

వ్యాపార సముదాయాలకు సైతం..

హౌసింగ్ అధికారులు మండల కేంద్రంలో వ్యాపార సముదాయాలకు సైతం జగనన్న ఇంటి బిల్లులు మంజూరు చేశారు. పాత మిద్దెలకు బిల్లులు మంజూరు చేశారు. మండల కేంద్రంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్, హౌసింగ్ ఏఈలు వైసీపీ నాయకులతో కుమ్మక్కై మామూళ్లు తీసుకుని రూ.లక్షల బిల్లులు మంజూరు చేశారు. ఒక్కో ఇంటికి రెండు మూడు బిల్లులు మంజూరు చేశారు. కెనరా బ్యాంక్‌కు దాదాపుగా రూ. 4లక్షలు పూర్తి బిల్లును ఇచ్చారు. ఇద్దరి పేర్లను హౌసింగ్ అధికారులు ఆర్ఎల్ (రూఫ్‌లెవెల్)లో బిల్లులు పెట్టేందుకు రికార్డులలో చూపించారు. కానీ పూర్తి బిల్లు(కంప్లీట్)పెట్టె సమయానికి ఇబ్బందులు వస్తాయని తెలివిగా లిస్టులో నుంచి పేర్లను తొలగించారు. ఎవరు సమాచారం అడిగినా కంప్లీట్ లిస్టులో వీరి పేర్లు లేని జాబితా మాత్రమే బయటకు ఇస్తున్నారు. ఆర్ఎల్‌లో ఉండే ఇళ్లు కంప్లీట్‌లోకి వచ్చేసరికి మాయం అయిపోయాయి. హౌసింగ్ అధికారులు మామూళ్లు ఇచ్చిన వారికి, అప్పటి వైసీపీ నేతలు చెప్పిన వారికి ఏమాత్రం వెనుకాడకుండా బిల్లులు మంజూరు చేశారు. మండలంలోని జగనన్న ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపి, ప్రభుత్వ నిధులను రికవరీ చేయాలని జిల్లా అధికారులు, మండల అధికారులకు ఇదివరకే మండల ప్రజలు, దండోర నాయకులు ఫిర్యాదు చేశారు.

ఈ విషయమై హౌసింగ్ అధికారులను వివరణ కోరగా వలిపి రెడ్డి లక్ష్మీనరసమ్మ, వలిపి రెడ్డి లావణ్య రెడ్డికి సంబంధించి రెండు ఇళ్లకు బిల్లులు పూర్తిగా మంజూరు చేశామన్నారు. రెండు బిల్లులు పెట్టిన మాట వాస్తవమే కానీ తాము ఇళ్ల నిర్మాణానికి మాత్రమే బిల్లులు మంజూరు చేశామన్నారు.



జగనన్న ఇంటి బిల్లుతో రీమోడలింగ్ చేసిన కెనరా బ్యాంక్

చాకలి శ్రీనివాస్ దొరికాడా..?

హిందూపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సంచలనం రేకెత్తించిన అత్తాకోడలిపై సామూహిక అత్యాచారం కేసులో కీలక నిందితుడు చాకలి శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని. విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. చిలమత్తూరు మండలంలో నిర్మాణంలో ఉన్న పరిశ్రమ వద్ద వాచ్‌మన్ కుటుంబంలోని అత్తాకోడలిపై ఈనెల 11 అర్ధరాత్రి దాటాక ఆరుగురు దుండగులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ కేసులో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్, అంతర్రాష్ట్ర దొంగ ఎరుకుల నాగేంద్రతోపాటు మరో పాత నేరస్థుడు సాకే ప్రవీణ్‌కుమార్, ముగ్గురు మైనర్లను ఈనెల 15న పోలీసులు అరెస్టు చేశారు. అత్యాచారాల్లో ఆరితేరిన కీలక నిందితుడు చాకలి శ్రీనివాస్ పరారీలో ఉన్నాడు. ఇతడిని పట్టుకునేందుకు జిల్లా ఎస్పీ మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని పట్టణాల్లో ఇతడి కోసం నిఘావేశారు. ఈ తరుణంలో గురువారం సాయంత్రం మడకశిరలో ఉన్నాడన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అతడిని అదుపులోకి తీసుకుని, అక్కడి నుంచి రహస్య ప్రదేశానికి తీసుకెళ్లి విచారిస్తున్నట్లు తెలిసింది. పట్టుబడిన ఐదుగురు నిందితులు అత్యాచారాలతోపాటు గతంలో వారు చేసిన నేరాలను వివరించారు. కీలక నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో ఇతడి ద్వారా ఏయే నేరాలు వెలుగులోకి వస్తాయోనన్న చర్చ పోలీసు వర్గాల్లో సాగుతోంది.

మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయండి

నారా లోకేశ్‌కు మంత్రి సత్యకుమార్ వినతి

ధర్మవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారికతపై గట్టిసందేశం పంపేవిధంగా రాయలసీమలో మహిళలకు ప్రత్యేక ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటుచేసే విషయాన్ని పరిశీలించామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు లేఖ పంపారు. ఆ లేఖను మంత్రి మీడియాకు విడుదల చేశారు. జనాభాలో సగం ఉన్న మహిళలకు స్థిరమైన అభివృద్ధి అవకాశాలు కల్పించే అంశంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని లేఖలో అభిప్రాయపడ్డారు. రాయలసీమ సామాజిక, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, తగిన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఇదేనని మంత్రి లేఖలో స్పష్టం చేశారు. ధర్మవరంలో ప్రత్యేకంగా మహిళల కోసం ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు అనంతపురం జేఎన్టీయూ ప్రతిపాదించిందని మంత్రి సత్యకుమార్ లేఖలో ప్రస్తావించారు.

స్వర్ణకారుల సంబరాలు



ధర్మవరంలో సంబరాలు చేసుకుంటున్న స్వర్ణకారులు

ధర్మవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్వర్ణకారుల ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడంతో ధర్మవరంలో స్వర్ణకారులు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం అంజుమన్ సర్కిల్‌లో స్వర్ణకారులు కేక్‌కట్ చేసి, ఆనందం పంచుకున్నారు. అనంతరం స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు ఖలీల్ మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే దానిని నెరవేర్చారన్నారు. ఇది స్వర్ణకారులకు సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో స్వర్ణకారులు కేహెచ్ ప్రకాశ్, షామీర్, షబ్బీర్, గోవిందరాజులు, అనిల్, సతీశ్ పాల్గొన్నారు.

మహా సమాధిని దర్శించుకున్న కేంద్రమంత్రి



సత్యసాయి మహాసమాధికి నమస్కరిస్తున్న కేంద్రమంత్రి మురుగన్

పుట్టపర్తి, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): కేంద్ర సమాచార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి మురగన్ శుక్రవారం రాత్రి పట్టణంలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి బెంగళూరు నుంచి రోడ్డుమార్గాన సాయంత్రం 5.30 గంటలకు ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. కేంద్రమంత్రికి జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, తహసీల్దార్ రంగనాయకులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, స్వాగతం పలికారు. శాంతిభవనంలో విశ్రాంతి తీసుకుని 6.30 గంటలకు సాయికుల్వంత్ సభామండపానికి వెళ్లారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం రాత్రి 7 గంటలకు రోడ్డుమార్గాన ప్రత్యేక కాన్వాయ్‌లో బెంగళూరుకు తిరిగి వెళ్లారు.

రేపు ఆప్టా రాష్ట్ర స్థాయి కౌన్సిల్ సమావేశం

అనంతపురం విద్య, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(ఆప్టా) రెండో రాష్ట్రస్థాయి కౌన్సిల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి వెంకటరత్నం శుక్ర వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని ఉపాధ్యాయభవన్‌లో సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఇతర జిల్లాల అధ్యక్షులు, పలువురు నాయకులు హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని నాయకులు అందరూ హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఆలయం ధ్వంసం

గుప్తనిధుల వేటగాళ్ల అకృత్యం



ధ్వంసమైన అపరాదయ్యస్వామి గుడి

బత్తలపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):గుప్తనిధుల వేటగాళ్లు బరితెగించారు. మండలంలోని అప్రాచెరువు గ్రామ సమీపానగల అపరాదయ్య స్వామి ఆలయాన్ని గురువారం రాత్రి పూర్తిగా ధ్వంసం చేశారు. తరాలుగా అపరాదయ్యస్వామి గుడి ఉంది. గుర్తుతెలియని దుండగులు ఎక్స్‌వేటర్‌తో తొలగించారు. శుక్రవారం ఉదయం అటుగా వెళ్తున్న వారు గమనించి, గ్రామస్థులకు తెలిపారు. గ్రామస్థులు అక్కడికి చేరుకుని, ఆలయాన్ని తొలగించడం దారుణమని ఆవేదన చెందారు.



మార్కెట్ సౌకర్యం కల్పించాలి

సీతాఫలాలకు మంచి డిమాండ్ ఉంటుంది. వాటిని ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి, విక్రయించాల్సి వస్తోంది. స్థానికంగా మార్కెట్ సౌకర్యాం కల్పిస్తే రవాణా ఖర్చులు ఆదా అవుతాయి. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- భీమప్ప, కూలీ, రొప్పం



ఈ పండు వెరీ స్పెషల్..



సీతాఫలానికి ఎన్నెన్నో ప్రత్యేకతలు

ఈ సీజన్‌లో మాత్రమే దొరికే మధురఫలం

ఎందరో పేదలకు ఉపాధి

సీతాఫలాలను విక్రయిస్తున్న కూలీలు



మడకశిర రూరల్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): సీతాఫలం అంటే ఎంతో ప్రత్యేకం. కొండప్రాంతాల్లో పండే అరుదైన ఫలం. వర్షాకాలంలో మాత్రమే పండుతుంది. ఔషధ గుణాలు అధికం. రసాయన మందులేవీ వాడరు కాబట్టి ఎలాంటి సంకోచం లేకుండా ఆరగించవచ్చు. అంతేకాదు, ఎందరో కూలీలకు ఉపాధి కూడా చూపుతుంది. మడకశిర ప్రాంతంలో కొండలు, గుట్టలు అధికంగా ఉన్నాయి. వాటిలో సీతాఫలాలు పండుతాయి. దీంతో ఈ ప్రాంతం సీతాఫలాలకు ప్రసిద్ధి. మండలంలోని ఏఆర్ రొప్పం, ఎగువ రామగిరి, దిగువ రామగిరి, హెచ్‌ఆర్ పాళ్యం, గౌరిపురం గుండుమల, కదిరేపల్లి, గుర్రపుకొండ, ఉగ్రేపల్లి, బూదిలి, కేకాతి గ్రామాల నుంచి అధికంగా సీతాఫలాలు వస్తున్నాయి. ఆయా గ్రామాల కూలీలు సెప్టెంబరు నుంచి మూడు నెలలపాటు సీతాఫలాల ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఆయాగ్రామాల కూలీలు, రైతులు రోజూ వేకువజామునే గ్రామ సమీపంలోని కొండలు, గుట్టల్లోకి వెళ్లి చెట్ల నుంచి సీతాఫలాలను కోసుకొస్తారు. వాటిని మడకశిరలో విక్రయిస్తుంటారు. మరికొంతమంది వాటిని పావగడకు తీసుకెళ్తారు. దాదాపు 250 కుటుంబాలు సీతాఫలాల నుంచి ఉపాధి పొందుతున్నాయి. సీతాఫలాల్లో ఔషధ గుణాలు అధికం. వాటికి మార్కెట్‌లో డిమాండ్ కూడా ఎక్కువే. బెంగళూరు, తుమకూరు తదితర నగరాల నుంచి వచ్చి సీతాఫలాలను కొనుగోలు చేస్తున్నారు.

రైతులను ప్రోత్సహించాలి



నాకున్న పొలంలో 50 సీతాఫలం చెట్లున్నాయి. మంచి దిగుబడి వస్తోంది. వాటికితోడు కొండగుట్టల్లో కాయలు కోసుకొచ్చి, పట్టణానికి తీసుకెళ్లి, విక్రయిస్తున్నా. ఖర్చులుపోను కొంత ఆదాయం వస్తోంది. సంబంధిత అధికారులు.. సీతాఫలం సాగుపై రైతులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించాలి.

-కిష్టప్ప, రైతు, బూదిపల్లి

సెంట్రల్ సిలబస్.. చిన్న కథ కాదు..!

చదువు ఒత్తిడి భరించలేక మాయమైన విద్యార్థి

అత్తారింటికి ఆటోలో ప్రయాణం.. కథ సుఖాంతం

సినిమాకు తీసుకెళ్లి.. ఊరడించి.. బడికి చేర్చిన తండ్రి


అనంతపురం క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ఒకప్పుడు ఫ్యాక్షన్ కోసం ఎంతకైనా తెగించేవారు. ఇప్పుడు బిడ్డల చదువుల కోసం అంతకు మించి చేస్తున్నారు. మరీ ముఖ్యంగా.. పల్లెటూరి తల్లిదండ్రులు చెమటను కరెన్సీ మూటలుగా మార్చి కార్పొరేటు విద్యాసంస్థలకు కట్టబెడుతున్నారు. తమలాగా పిల్లలు కష్టాలు పడకూడదన్న తాపత్రయం వారిది. ఈ ఆలోచనతో ఇంటికి, ఊరికి దూరంగా.. నగరాలకు తీసుకువెళ్లి హాస్టళ్లలో వదులుతున్నారు. అక్కడ పసివారు పడే ఇబ్బందుల గురించి పెద్దగా ఆలోచించడం లేదు. 'వెళ్లను నాన్నా.. ఇంటి వద్దే ఉండి చదువుకుంటా..' అని కన్నబిడ్డలు కంట తడి పెడితే.. కన్నవారు కన్నీళ్లను దాచుకుని ఊరడిస్తుంటారు. 'బాగా చదువుకో.. భవిష్యత్తు బాగుంటుంది. నీ కోసమే కదా ఇదంతా..?' అని నచ్చజెప్పి వస్తుంటారు. కాదూ కూడదు అంటే.. కొందరు మొరటుగా రెండు దెబ్బలు వేస్తుంటారు. గట్టిగా మందలిస్తుంటారు.

అనంతపురం నగరానికి సమీపంలో ఉన్న ఓ పల్లెటూరు వారిది. కొడుకును బాగా చదివించాలని నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి వరకు చదివించాడు. మరింత బాగా చదివించాలని గత ఏడాది 8వ తరగతికి కర్నూలులోని ఓ ప్రముఖ పాఠశాలలో చేర్పించాడు. ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్న ఆ పిల్లవాడు దసరా పండుగకు ఇంటికొచ్చాడు. సెలవులు పూర్తి కావడంతో కొడుకును తిరిగి బడికి పంపేందుకు తండ్రి బైక్‌పై ఎక్కించుకుని శుక్రవారం అనంతపురం బస్టాండుకు వచ్చాడు. బస్సు ఇంకా రాకపోవడంతో 'వెళ్లి టిఫిన్ చేసి.. వచ్చేటప్పుడు వాటర్ బాటిల్, న్యూస్ పేపర్ తీసుకురా..' అని కొడుకును పంపించాడు తండ్రి. టిఫిన్‌కు వెళ్లిన కొడుకు అరగంట దాటినా తిరిగి రాకపోవడంతో తండ్రి కంగారుపడ్డాడు. స్నేహితులకు విషయం చెప్పి పలు ప్రాంతాల్లో గాలించాడు. అనంతపురంలో ఉంటున్న తన సోదరికి విషయం తెలియజేశాడు. ఆమె తన అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ భార్యకు సమాచారం ఇచ్చింది. 'మా అల్లుడు వస్తే నాకు చెప్పు. నేను వెతికేందుకు వెళతా..' అని చెప్పింది. ఈ లోగా అల్లుడు ఆటోలో నేరుగా తన అత్త ఉంటున్న అపార్ట్‌మెంట్ వద్ద దిగి.. అక్కడే తచ్చాడటం ప్రారంభించాడు. వాచ్‌మెన్ భార్య గమనించి.. 'మీ అల్లుడొచ్చాడు..' అని అత్తకు చెప్పింది. దీంతో వెంటనే అత్త ఆత్రంగా వచ్చి అల్లుడిని ఇంట్లోకి తీసుకెళ్లింది. సోదరుడికి సమాచారం ఇచ్చింది. అప్పటిదాకా కొడుకు ఏమయ్యాడో అని అల్లాడిపోయిన తండ్రి.. ఊపిరి పీల్చుకున్నాడు.


విషయం ఏమిటంటే..

సోదరి ఇంటికి చేరుకున్న విద్యార్థి తండ్రి.. 'ఏమైంది నాన్నా..?' అని అడిగాడు. ఇలా చెప్పాపెట్టకుండా మాయమైపోతే తన పరిస్థితి ఏమిటని ఆరా తీశాడు. అప్పుడు అసలు విషయం చెప్పాడు ఆ విద్యార్థి. 'ఎనిమిదో తరగతి వరకు స్టేట్ సిలబస్ చెప్పారు. ఇప్పుడు సెంట్రల్ సిలబస్ చెబుతున్నారు. ఇబ్బందిగా ఉంది..' అని బాధగా ముఖం పెట్టాడు. తండ్రికి విషయం అర్థమైంది. ఆవేశపడి కొడుకును తిట్టలేదు.. కొట్టలేదు. 'అదేం పెద్ద విషయం కాదులే.. నాతో చెబితే నేను చూసుకునేటోన్ని కదా..? బడిలో మాట్లాడే వాన్ని కదా..?' అని కొడుక్కు నచ్చజెప్పాడు. ఆ తరువాత సినిమాకు తీసుకెళ్లాడు. సినిమా చూసే క్రమంలో.. 'నువ్వు ఎలాగైనా చదువు. ఫస్ట్ రావాలని, సెకండ్ రావాలని లేదు. ప్రశాంతంగా చదువుకో.. పదో తరగతి పాసవ్వు చాలు. ఎలాంటి టెన్షన్ పడొద్దు..' అని అనునయించాడు. సినిమా అయిపోయాక.. 'ఇక బడికి వెళదామా..?' అని కొడుకును అడిగాడు తండ్రి. 'సరే.. పోదాం పద నాన్నా..' అన్నాడు ముద్దుల కొడుకు. బస్సు ఎక్కి.. సాయంత్రానికి ఇద్దరూ కర్నూలుకు చేరుకున్నారు. కొడుకును బడిలో దించి.. వెనుదిరిగాడు తండ్రి..!

జలపాత హొయలు..



జాలువారుతున్న బత్రేపల్లి జలపాతం



పర్యాటకుల సందడి

కదిరి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎడతెరపిలేని వర్షాలకు తలుపుల మండలంలోని బత్రేపల్లి జలపాతం జలకళను సంతరించుకుంది. కొండలపై నుంచి శుక్రవారం వర్షపునీరు జాలువారుతూ కనువిందు చేస్తోంది. జలపాతాన్ని చూడడానికి ఉదయం నుంచి కదిరి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఇటీవలే అటవీశాఖ ఈ ప్రాంత సుందరీకరణ పనులు చేపట్టింది. అవి పూర్తయితే మరింతమంది పర్యాటకులు ఈప్రాంతాన్ని సందర్శించే అవకాశం ఉంటుంది.

మత్తుపై గట్టి నిఘా వేయండి: కలెక్టర్



డ్రగ్స్ నియంత్రణ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్

అనంతపురం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు జిల్లాకు రవాణా కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో డ్రగ్స్ నియంత్రణపై జిల్లా స్థాయి నార్కోటిక్స్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. డ్రగ్స్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో పోలీసులు, రైల్వే అధికారులు ప్రత్యేక నిఘా వేయాలని సూచించారు. పాఠశాలల సహా అన్ని విద్యా సంస్థలు, జేఎన్‌టీయూ, ఎస్కేయూపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అన్నారు. మత్తు వల్ల కలిగే అనర్థాల గురించి యువత, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. బస్టాండ్‌లలో పార్శిల్స్‌ను ఆర్టీసీ అధికారులు పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. జిల్లా సర్వజన వైద్యశాలలో అన్ని వసతులతో వారంలోపు డి-అడిక్షన్ వార్డును ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు ఆదేశించారు. మత్తు పదార్థాల విషయంలో ఎక్కడా రాజీ పడబోమని ఎస్పీ జగదీష్ అన్నారు. రవాణా చేసేవారిని చట్టపరంగా శిక్షిస్తామని, జిల్లా నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో విద్యాలయాలు, గ్రామాలలో మత్తు పదార్థాలతో కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. మత్తు పదార్థాల రవాణా విషయంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, గుంతకల్లు రైల్వే డివిజన్ డీఎస్పీ హర్షిత, డీటీసీ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.40



అనంతపురంరూరల్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 1500 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.26, కనిష్ఠ ధర రూ.17పలికినట్లు ఆయన తెలిపారు.

జీడిపల్లికి 1026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం 1026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 962 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.667 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు వెల్లడించారు.

బడిలో భయం.. భయం..



ఊడిపడిన వరండా పైకప్పు పెచ్చులు



పెచ్చులూడిన వరండా పైకప్పు

శిథిలావస్థకు చేరిన భవనం



మడకశిర మండలంలోని జమ్మానిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు భయంభయంగా ఉండాల్సి వస్తోంది. పాఠశాలలో 25 మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. రెండు భవనాలున్నాయి. ఒక భవనంలో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. పక్కనే ఉన్న మరో భవనం శిథిలావస్థకు చేరుకుంది. విద్యార్థులు విశ్రాంతి సమయం, సెలవు రోజుల్లో ఆ భవనంలోకి వెళ్లి ఆడుకుంటుంటారు. శిథిలావస్థకు చేరుకున్న భవనం పైకప్పు పెచ్చులు ఊడుతుండడంతో ఎప్పుడు, ఏం జరుగుతుందోనని తల్లి దండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వెంటనే భవనాన్ని తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.

-మడకశిర రూరల్(ఆంధ్రజ్యోతి)



పూజలు నిర్వహిస్తున్న కర్ణాటక భక్తులు

అలరించిన సంగీత కచేరి

పుట్టపర్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటక భక్తులు సంగీత గాన కచేరీతో సందర్శకులను అలరింపజేశారు. పర్తియాత్ర పేరుతో రెండు వేల మంది భక్తులు ప్రశాంతినిలయం చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంతులో కథ, సంకీర్తన్ యుగకే అవతార పేరిట సంగీత కచేరి నిర్వహించారు. మధురమైన వాయిద్య గానంతో భక్తులను తన్మయం చేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

నృత్యప్రదర్శనలో చిన్నారి ప్రతిభ



నృత్యం చేస్తున్న చిన్నారి రెడ్డిఉమా

కదిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న రెడ్డిఉమా నృత్య ప్రదర్శ నలో రాణిస్తోంది. ఈ బాలిక తండ్రి ఎస్పీ కుంట మండలం వాసి వెంకటరంగాచారి, ఏఈఓగా వ్యవసాయ శాఖలో పనిచేస్తున్నారు. ఉమా దసరా ఉత్స వాల సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతీలో నృత్య ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకుంది. గతంలో ఈ బాలిక కదిరి పట్టణం లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అనేక ప్రదర్శనలు ఇచ్చింది.

వరద బాధితులకు విరాళం



మంత్రికి చెక్కును అందజేస్తున్న వెంకటకృష్ణ

ధర్మవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం బత్తలపల్లెకు చెందిన విజ్ఞాన భారతి విద్యాలయ కరస్పాం డెంట్ వెంకటకృష్ణ ముఖ్య మంత్రి సహాయ నిధికి రూ.50 వేలను విరాళంగా ఇచ్చారు. ఆ చెక్కును విజయవాడలో సెక్రటేరియట్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు శుక్రవారం అందజేశారు.

ఈ-ఆఫీసుతో పారదర్శకత

ధర్మవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఈ-ఆఫీసు విధానం వల్ల పాలన పారదర్శకంగా ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం సెక్షన్ హెడ్స్, క్లెరికల్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక ఈ-ఆఫీసు ద్వారానే అన్ని ఫైళ్లను ప్రాసెస్ చేయాలన్నారు. ఈ విధానం వల్ల ఫైల్ ఎక్కడ ఆగి పోయిందో తెలుసుకునే వీలు ఉంటుందన్నారు. ఉద్యోగుల్లో జవాబు దారీతనం పెరుగుతుందన్నారు. ఫైల్స్ విషయాన్ని ఉన్నతాధికారులు కూడా చూసుకునే అవకాశం ఉంటుందన్నారు. పరిపాలన సమర్థవంతంగా ... వేగవంతంగా సాగుతుందన్నారు. అలాగే ప్రభుత్వ డిజిటల్ పరిపాలనా లక్ష్యాలను చేరడానికి తోడ్పడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్సన్, కేశవ పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ తనిఖీ

ధర్మవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డ్‌లోని ప్రభుత్వ చౌక ధాన్యపు స్టాక్ పాయింట్ (ఎంఎల్‌ఎస)ను ఆర్డీఓ మహేశ్ శుక్రవారం తనిఖీ చేపట్టారు. గోదాములో ఉన్న స్టాకు రిజిస్ట్రర్‌ను, అందులో ఉన్న స్టాక్ వివరాలను పరిశీలించారు. బియ్యం బస్తాలను తూకం వేసి పరిశీలించారు. తూకాల్లో పొరబాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్టాక్‌పాయింట్ అధికారులకు సూచించారు. ఆయన వెంట సీఎస్‌డీటీ లక్ష్మీదేవి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పంట నమోదు వివరాల వెల్లడి

నంబులపూలకుంట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయంలో వ్యవసాయాధికారులు రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఖరీఫ్‌లో సాగుచేసిన పంటల వివరాలను వెల్లడించారు. రైతులు సాగుచేసిన ఆయా పంటలు, విస్తీర్ణం, సాగుపై ఈకేవైసీ చేసిన వివరాలను వివరించారు. ఎవరైనా సాగుచేసి, జాబితాలో రైతుల పేర్లులేక పోతే తమ దృష్టికి తీసుకురావాలని ఏఓ లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. ఖరీఫ్, రబీలోకానీ ఎప్పుడైనా రైతులు సాగుచేసిన పంటలను ఈకేవైసీ చేయించుకుంటే ప్రభుత్వం అందించే సబ్సిడీలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ యుగంధర్, నరసింహారెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ గురుస్వామి పాల్గొన్నారు.

దిక్కూ దివానం లేదాయె..!

- ❖ ధర్మవరం రూరల్ ఎస్ఐ పోస్టు ఖాళీ
- ❖ 20 రోజులుగా భర్తీ చేయని ఉన్నతాధికారులు
- ❖ అధికంగా ఫ్యాక్షన్, సమస్యాత్మక గ్రామాలు
- ❖ ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపని ఎస్ఐలు
- ❖ పల్లెల్లో పెరుగుతున్న వివాదాలు, ఆధిపత్య పోరు
- ❖ ఇష్టారాజ్యంగా సిబ్బంది విధులు
- ❖ పంచాయితీలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్న వైనం



ధర్మవరం మండలం... జిల్లాలోనే అత్యధికంగా ఫ్యాక్షన్ గ్రామాలు ఉన్న మండలం ఇది. ఇక్కడి పోలీసులు నిత్యం ఎంతో అప్రమత్తంగా ఉంటేనే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయి. అలాంటి ఈ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ పోస్ట్ దాదాపు 20 రోజులుగా ఖాళీగా ఉంది. దీంతో పలు గ్రామాల్లో శాంతిభద్రతలు గాడితప్పాయి. ఆదిపత్యపోరు మొదలైంది. పలు గొడవలు.. దొంగతనాలు జరుగుతున్నాయి. ఓ వైపు ఉన్నతాధికారులు ఎస్ఐ పోస్టును భర్తీ చేయడంలో మీనమేషాలు లెక్కిస్తుండటం.. మరో వైపు ఇక్కడికి ఎస్ఐగా రావడానికి ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో ఈ పోస్ట్ ఖాళీగా ఉంది.

ధర్మవరం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : రూరల్ మండలంలో ఫ్యాక్షన్, సమస్యాత్మక గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి చోట ఎస్ఐ పాత్ర చాలా కీలకం. అయితే దాదాపు 20 రోజుల నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు ఇక్కడి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతో మండలంలోని ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. ప్రతి గ్రామంలో ఆదిపత్య పోరు, ఫ్యాక్షన్‌కు సంబంధించి గొడవలు చెలరేగిపోతున్నాయి. దొంగతనాలు ఎక్కువయ్యాయి. తమ రక్షణ కల్పించాలని.. న్యాయం కావాలని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న బాధితులు నిరాశతో వెనుతిరుగుతున్నారు. ఎస్ఐ లేకపోవడంతో.. కిందిస్థాయి ఉద్యోగులూ విధులను నిర్లక్ష్యం చేస్తున్నారు. వారి సరిగా స్టేషన్‌లో ఉండటం లేదు. దీంతో తమ సమస్య ఎవరికి చెప్పుకోవాలని బాధితులు వాపోతున్నారు.

● వామ్మో.. అక్కడికి రాం : ధర్మవరం రూరల్‌లో సమస్యాత్మక, ఫ్యాక్షన్ గ్రామాలు ఎక్కువ. దీంతో ఇక్కడ ఎస్ఐగా రావడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఇక్కడి ఎస్ఐ నరేంద్ర దాదాపు 20 రోజుల క్రితం రొద్దంకు బదిలీచేశారు. పది రోజుల క్రితం ఇక్కడికి బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులును బదిలీచేశారు. ఆయన అక్కడ ఎస్ఐగా ఉంటూ ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. బత్తలపల్లికు ఎస్ఐని నియమించకపోవడంతోనే ఆయన ఇక్కడికి రాలేకపోతున్నారని ఆశాఖ ఉద్యోగులు అంటున్నారు.



ధర్మవరం రూరల్ పోలీస్‌స్టేషన్



సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

● ఫ్యాక్షన్ గ్రామాలివే : జిల్లాలోనే అత్యధికంగా ఫ్యాక్షన్ గ్రామాలు కలిగిన మండలం ధర్మవరం. గతంలో ఫ్యాక్షన్ ప్రభావానికి చాలా కుటుంబాలు గ్రామాలు విడిచి వెళ్లాయి. మండలంలో కామిరెడ్డిపల్లి, ఓబుళనాయునిపల్లి, రేగాటిపల్లి, బడన్నపల్లి, నేలకోట, తిప్పేపల్లి, సీసీకొత్తకోట, కుణుతూరు, సుబ్బరావుపేట, రావులచెరువు గ్రామాలు ఫాక్షన్, సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మండలానికి ఎస్ఐ లేకపోవడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆయా గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● ఇష్టారాజ్యంగా సిబ్బంది విధులు : స్టేషన్‌కు ఎస్ఐ లేకపోవడంతో సిబ్బంది సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది సిబ్బంది అంతామేమే అన్నట్లుగా భూసమస్య మొదలు కొని.. భార్యాభర్తల సమస్యల వరకూ పంచాయితీలు నిర్వహిస్తూ... సొమ్ము చేసుకొంటున్నారు. కొంతమంది సిబ్బంది స్టేషన్‌కు కూడా రాకుండా బయట టీస్టాల్స్, కేఫ్‌లలో కాలక్షేపం చేస్తున్నారు.

త్వరలో వస్తారు

బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులును ధర్మవరం రూరల్ ఎస్ఐగా ఉన్నతాధికారులు బదిలీచేశారు. బత్తలపల్లికి నూతన ఎస్ఐ సోమశేఖర్ బాధ్యతలు తీసుకున్నారు. త్వరలో ఇక్కడ శ్రీనివాసులు బాధ్యతలు తీసుకుంటారు. అంతవరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

-శ్రీనివాసులు, డీఎస్పీ, ధర్మవరం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

శివంపల్లిలో పల్లె పండుగ

తాడిమర్రి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివంపల్లిలో పల్లె పండుగ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పండ్ల తోటల పెంపకానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ విజయశేఖర్, ఏపీఓ సంజీవరెడ్డి, టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ముంటిమడుగు హర్ష, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గోపాల్ రెడ్డి, తెలుగు రైతు నాయకులు పక్కీర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ గణేశ్, టీడీపీ నాయకులు గణేశ్, విశ్వనాథ్, రంగయ్య పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇళ్లు



ధర్మవరం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నూరు బత్తలపల్లికి చెందిన లక్ష్మీదేవి ఇల్లు, నేలకోటతండా చెందిన పార్వతిబాయికి చెందిన ఇల్లు కూలాయి. మూడు రోజులుగా కురిసిన వర్షానికి ఇళ్ల గోడలు దెబ్బతిని ఇళ్లంతా కారి పడిపోయాయని బాధితులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఇళ్ల మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

నేలవాలిన చెట్టు



నంబులపూలకుంట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : స్థానిక కదిరి, రాయచోటి ప్రధాన రహదారి శివాలయానికి వెళ్లే రహదారి సమీపంలో ఓ చెట్టు శుక్రవారం రాత్రి రోడ్డుకు అడ్డంగా కూలింది. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఒక్కసారి చెట్టు వేర్లతో సహా నేలకూ లింది. ఈ విషయాన్ని చుట్టుపక్కలవారు పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు చెట్టును రోడ్డుకు అడ్డంగా లేకుండా పక్కకు తొలగించి, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. గంటపాటు విద్యుత్ అంతరాయం కలిగింది.

వర్షానికి తడిసి ముద్దయిన వేరుశనగ కాయలు

నల్లగా మారి బూజుపట్టిన పంట

ధర్మవరం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అప్పులు చేసి... ఆరుగాలం కష్టపడి పండించిన పంట తుఫాన్ ప్రభావంతో దెబ్బతింది. కాయలన్నీ నల్లగా మారి బూజుపట్టాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మూడు రోజులుగా కురిసిన వర్షానికి పంట పూర్తిగా తగిసి.. నల్లగా మారడమేకాకుండా... పశువుల మేత కూడా పనికి రాకుండా పోయింది. మండలంలోని ఏలుకుంట్ల గ్రామానికి చెందిన రైతు మురళీయాదవ్ మూడు ఎకరాల్లో వేరుశనగను బోరుబావి కింద సాగు చేశాడు. పంట సాగుకు సుమారు రూ. లక్ష వరకు పెట్టుబడి పెట్టాడు. పంట నాలుగునెలలు పూర్తికాగానే పంట దిగుబడి రావడంతో తొలగించారు. తొలగించిన రాత్రి నుంచే వర్షం కురవడంతో పంటంతా తోటలోనే తడిసి కుళ్లిపోయింది.

● నల్లమాడ: తిప్పయ్యగారిపల్లి గ్రామానికి చెందిన రైతు భాస్కర్‌రెడ్డి సాగుచేసిన వేరుశనగ పంట పొలంలోనే కుళ్లి బూజుపట్టింది. ఇతను తొలేటివారిపల్లి గ్రామానికి చె ందిన హనుమంతరెడ్డి నుంచి బోరు కింద ఐదు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని పంట సాగుచేశాడు. పంట సాగు కోసం రూ.1.50 లక్షలు ఖర్చు చేశారు. పంట బాగానే వచ్చింది. నాలుగు రోజుల క్రితం పంట తొలగించారు. అప్పటినుంచి కురిసిన వానకు పొలంలోనే పంట కుళ్లి, బూజుపట్టింది. కనీసం పెట్టుబడికూడా వచ్చేపరిస్థితి లేదు.

● తనకల్లు: కనసానివారిపల్లి వద్ద రైతు ఉదయ్‌కుమార్ ఖరీఫ్‌లో వ్యవసాయ బోరుకింద ఎకరలో వరి సాగుచేశారు. పంట గింజ పట్టేదశలో ఉండగా.. ఐదురోజులుగా కురుస్తున్నా వర్షాలకు వరి మొత్తం నేలకొరిగింది. దీంతో రూ.50 వేలు పంట నష్టం జరిగినట్లు రైతు ఆవేదన చెందారు.

రైతు కష్టం.. వానపాలు..!



ఏలుకుంట్ల గ్రామంలో నల్లగా మారిన వేరుశనగ కాయలు



కనసానివారిపల్లి సమీపాన నేలకొరిగిన వరిపంట

రీసర్వేపై గ్రామసభలు

గాండ్లపెంట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమతంపల్లిలో శుక్రవారం రీసర్వేపై గ్రామసభలు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ బాబురావు మాట్లాడుతూ రీసర్వేలో రైతులకు ఎదురైన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు జాఫర్, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

● నంబులపూలకుంట : మండలంలోని శనివారం నుంచి రీసర్వే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నరేంద్రకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం గూటిబైలు, మంగళవారం ముడుపుల జీవి గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకు ఈ సభలు నిర్వహిస్తామన్నారు. ఈ గ్రామ సభలకు రైతులు హాజరుకావాలని కోరారు.

● తనకల్లు : మండలంలో 19న దిగువమండ్లిపల్లి, 22న దండువారిపల్లి, 25న వెంకటరాయునిపల్లి 27న మిద్దనాయునిపాళ్యం, 29న ఉలవలవాండ్లపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శోభానువర్ధమ్మ తెలిపారు. రైతులందరూ ఈ గ్రామసభల్లో పాల్గొని రీసర్వే సమస్యలుంటే పరిష్కరించుకోవాలని సూచించారు.

● నల్లమాడ : మండలంలో 19న చౌటకుంటపల్లి, 22న గోపేపల్లి, 23 వంకరకుంట, 24 కురమాల గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రంగనాయకులు తెలిపారు.

విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నిర్దిష్ట అభ్యాసన వైకల్యంపై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. భవితాకేంద్రం చిన్నారులు ఈ ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈఓలు సురేష్‌బాబు, రమణ మాట్లాడుతూ.. భవిత చిన్నారులకు సరైన శిక్షణ ఇస్తే వారు అన్నిరంగాల్లో రాణించగలరన్నారు. సమానత్వ హక్కు, ఉచిత విద్య అందించాలన్నారు. దివ్యాంగులను చిన్నచూపు చూడకూడదనీ, వారి జీవనోపాధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సాహిత విద్యా ఉపాధ్యాయులు నాగశేఖర్‌రెడ్డి, నరసింహబాబు, టీచర్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

తనకల్లు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలసముద్రం గ్రామంలో బోరు నుంచి నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ పూడి పోయింది. దీంతో 20 రోజులుగా తాగునీటి సమస్య నెలకుంది. గ్రామస్థులు వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకునే వారు. అయితే ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వాల్మీకి అశోక్ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే శుక్రవారం మండల, పంచాయతీ అధికారులను ఆ గ్రామానికి పంపి, సమస్యను పరిష్కరించేలా చేశారు.

వెలుగు కార్యాలయంలో వార్షిక మహాసభలు

నల్లమాడ , అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : సాధన మండల సమాఖ్య వెలుగు కార్యాలయంలో 21వ వార్షికోత్సవ మహాసభలు శుక్రవారం నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ నరసయ్య మాట్లాడుతూ మండలంలో ఉన్న వెలుగుసంఘాలు, లావాదేవీలు సక్రమంగా నిర్వహించుకోవాలన్నారు. అలా ఉన్నప్పుడే మరింత రుణాలు ఇవ్వడానికి అవకాశముంటుందన్నారు. అనంతరం సమాఖ్యకు లీడర్లను ఎంపిక చేశారు. అధ్యక్షురాలుగా వనజమ్మ, కార్యదర్శిగా శ్యామలమ్మ, కోశాధికారిగా అనసూయమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు ఓబులేసు, గోపాల్, సీసీలు నగేష్, నరసింహారెడ్డి, చౌడప్ప, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుల అరెస్టు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తుమ్మలకుంట్లపల్లిలో ముగ్గురు, గాజుకుంటపల్లిలో ముగ్గురు బెల్టు షాపు నిర్వహిస్తుండగా.. అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు నల్లమాడ సీఐ నరేంద్ర రెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి చెప్పారు. శుక్రవారం వారు స్థానిక పోలీస్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ... వారి నుంచి 180 ఎంఎల్ 240 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏఎస్ఐ రమణారెడ్డి, కిషోర్‌రెడ్డి, సిబ్బంది సాయి, లోకేష్, అంజి, గంగోలి పాల్గొన్నారు.

ఆసుపత్రికి అధునాతన ఎక్స్‌రే యంత్రం



300 ఎంఏ సామర్థ్యంగల ఎక్స్‌రే యంత్రం

హిందూపురం అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి సరికొత్త అధునాతన ఎక్స్‌రే యంత్రం వచ్చింది. ఇంతకుముందు 100 ఎంఏ సామర్థ్యంగల యంత్రాలు ఉండేవి. వాటితోనే రోగులకు సేవలు అందిస్తున్నారు. అవి మొబైల్ ఎక్స్‌రే యంత్రాలు కావడంతో ఒక చోట నుంచి మరో చోటికి వాటిని తీసుకెళ్ళి ఎక్స్‌రే తీసేవారు. కొత్తగా వచ్చిన 300ఎంఏ ఎక్స్‌రే యంత్రం ఫిక్స్‌డ్‌గా ఉంటుంది. ప్రస్తుతం 4 మొబైల్ ఎక్స్‌రే యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా రోజు 90 నుంచి వంద మందికి ఎక్స్‌రేలు తీస్తున్నారు. కొత్తయంత్రం వారం రోజుల్లో అందుబాటులోకి వస్తే మరింత మందికి సేవలు అందించవచ్చని టెక్నీషియన్లు పేర్కొంటున్నారు.

చెరువు గండి పూడ్చివేత



తూమువద్ద మరమ్మతులు చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఈదులబళాపురం చెరువుకు శుక్రవారం గండి పడింది. చెరువు రెండో తూమువద్ద గోడ కుంగి నీరు బయటకు రావడంతో గ్రామస్థులు గమనించి అధికారులకు సమాచారం అందించారు. మంత్రి సవితకు విషయాన్ని చేరవేయడంతో ఆగమేఘాలపై యంత్రాంగం కదిలింది. చెరువు వద్దకు చేరుకున్న ఇరిగేషన్ డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ రమేష్, నాయకులు నరసింహమూర్తి, ఈ కిష్టప్పలతోకలిసి పరిస్థితిని సమీక్షించారు. హుటాహుటిన జేసీబీని రప్పించి గ్రామస్థుల సహకారంతో గండిని పూడ్చేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది.

రేపు గిరిప్రదక్షిణ

హిందూపురం అర్బన్, అక్టోబరు 18: పట్టణ పరిధిలోని గుడ్డం రంగనాథస్వామి దేవాలయంలో ఆదివారం సాయంత్రం గిరిప్రదక్షిణ నిర్వహించనున్నట్లు దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణ, ఈఓ నాగేంద్ర, అర్చకుడు గోవిందశర్మ పేర్కొన్నారు. సాయంత్రం 6.45 గంటలకు గిరిప్రదక్షిణ ప్రారంభమౌతుందని భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

కారు, కంటైనర్ ఢీ



ప్రమాదంలో దెబ్బతిన్నకారు

గోరంట్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారిపై లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద శుక్రవారం కారు, కంటైనర్‌ను ఢీకొన్న ప్రమాదంలో అదృష్ట వశాత్తూ నలుగురు కుటుంబసభ్యులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కర్నాటక రాష్ట్రంలోని మంగుళూరుకు చెందిన తారానాథ్ భార్య కావ్య, కుమార్తెలు లహరిక, చర్వితలతో సొంత కారులో బెంగుళూరునుంచి మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనం కోసం వెళ్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. రెడ్డిచెరువుపల్లి సమీపంలోని ఆలయం వద్ద కారు ముందు చక్రం పంచర్ కావడంతో అదుపు తప్పి, డివైడర్‌ను దాటుకుని బెంగుళూరు వెళ్తున్న కంటైనర్ లారీని ఢీకొంది. కియా పరిశ్రమకుచెందిన కంటెయినర్ బెంగుళూరుకు సరుకు తీసుకెళ్తుండగా కారు ఢీకొనడంతో డీజిల్ ట్యాంక్ ధ్వంసమైంది. ప్రమాదంలో తారానాథ్ కుడి చేయి విరగగా, పెనుకొండలో ప్రథమచికిత్స అనంతరం బెంగుళూరుకు తరలించినట్లు సీఐ శేఖర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గోరంట్ల బాలికలు



బాలికలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గోరంట్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాలకు చెందిన కళ్యాణి, పల్లవి బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ద్వారా అండర్-14 విభాగంలో 8వ తరగతి విద్యార్థినులు పల్లవి, కళ్యాణి ఇటీవల అనంతపురంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొంది, రాష్ట్రస్థాయి పోటీకి ఎంపిక అయ్యారన్నారు. గోరంట్ల చౌడేశ్వరీ కాలనీకి చెందిన చేనేత కార్మికుల కుమార్తెలైన వీరు రాష్ట్రస్థాయికి ఎంపికవడంతో అందరూ హర్షం వ్యక్తం చేశారు.

వర్షంతో తరగతి గదుల్లోకి నీరు



పెనుకొండ రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రగిరిలో మండలపరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తరగతి గదుల్లోకి నీరుచేరి విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారు. దీంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తరగతి గదులు మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఖాకీ వార్..!

క్రమశిక్షణ కోల్పోతున్న పోలీసులు

స్టేషన్‌లో గ్రూపులు కడుతున్న వైనం



హిందూపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కొంతమంది పోలీసులు బరితెగించి వ్యవహరిస్తున్నారు. హిందూపురం, పెనుకొండ సబ్‌డివిజన్ పరిధిలో కొందరు పోలీసుల తీరు తరచూ వివాదాస్పదంగా మారుతోంది. వారి వ్యవహారశైలి పోలీస్‌శాఖకే మచ్చ తెచ్చేవిధంగా మారుతోంది. సాధారణంగా పోలీసులు అంటే క్రమశిక్షణకు మారుపేరు. ఇప్పటికీ మన దేశంలో క్రమశిక్షణ ఒక్క పోలీస్‌శాఖలోనే ఉంటుందని తరచూ ఆశాఖలో చెప్పుకుంటుంటారు. ఇటీవల కొంతమంది సిబ్బంది కట్టుతప్పుతున్నారు. అక్రమార్జనలో కొందరు సిబ్బంది బరితెగిస్తున్నారు. వివాదాల్లో తలదూర్చి సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇలాంటి వ్యవహారాలు తరచూ వెలుగు చూస్తున్నాయి. సంబంధిత అధికారులపై ఉన్నతాధికారులు నిఘా పెడుతున్నా ఇప్పటికీ కొందరిలో మార్పు రాలేదు. మరీ ముఖ్యంగా కిందిస్థాయి సిబ్బందిలో పై అధికారులంటే లెక్కలేనితనం వచ్చింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలీస్ వ్యవస్థ నిర్వీర్యం అయిందనడంలో సందేహం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా ఇప్పటికీ నేరస్తులతో చేతులు కలుపుతూ కొన్ని వ్యవహారాల్లో తలదూర్చుతున్నట్లు తెలుస్తోంది.

క్రమశిక్షణకు తిలోదకాలు

హిందూపురంలో హిందూపురంలో మట్కా, పేకాట, గంజాయి, వ్యాపారాలు చేసే ముఠాసభ్యులతో కొంతమంది పోలీసులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలున్నాయి. దీనివల్లే జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు హిందూపురానికి వచ్చినా కొంతమంది నేరస్తులను పట్టుకోలేకపోతున్నారు. కారణం వారికి ఇక్కడున్న సిబ్బంది సహకారం పుష్కలంగా ఉండటమే. ఇటీవల జిల్లా ప్రత్యేక బృందం వచ్చినప్పుడు గంజాయితోపాటు మత్తుమందు సరఫరాచేసే వ్యక్తిని పట్టుకుంటే ఇక్కడ ఒకరిద్దరు పోలీసులు అతడిని తప్పించినట్లు సమాచారం. అదేవిధంగా ఇటీవల పేకాట స్థావరాలపై దాడులు చేయడానికి ఎస్ఐలు, సీఐలు వెళ్తుంటే ఆ సమాచారాన్ని పేకాట రాయుళ్లకు ముందుగానే చేరవేశారు. దీనికారణంగా సిబ్బంది అక్కడకు చేరుకునేసరికి పేకాట రాయుళ్లు పరారయ్యారు. దీంతో పాటు కొన్ని సివిల్ పంచాయతీల్లో సైతం సిబ్బంది తలదూర్చుతున్నారు. పట్టణంలో కొంతమంది సిబ్బంది అసాంఘిక కార్యకలాపాలకు అండదండగా నిలుస్తున్నారు. ఇలా నిలుస్తున్న వారిని పై అధికారులకు సైతం వెనకేసుకు వస్తున్నారని సమాచారం. దీంతో సదరు సిబ్బంది పెట్రేగిపోతున్నారని పోలీస్‌శాఖ కోడై కూస్తోంది. పట్టణంలోని కొంతమంది పోలీసులు వ్యభిచారం నిర్వహించే వ్యక్తులకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ఇటీవల పై అధికారులకు ఫిర్యాదులు అందాయి. దానిపై ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. ఇటీవల రొద్దం పరిధిలో ఓ కేసుకు సంబంధించి ఉన్నతాధికారులు ఆదేశించినా అక్కడ పనిచేసిన అధికారిలో చలనం లేకపోవడం విశేషం. అంతేకాక ఈ స్టేషన్‌లో ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించి పనులు చేస్తున్నారని ఆ మండలంలో ప్రజలు చర్చించుకుంటున్నారు.

స్టేషన్‌లో గ్రూపులు

ఇవన్నీ ఇలా ఉంటే కొన్ని పోలీస్ స్టేషన్లలో సిబ్బంది ఇటీవల కాలంలో గ్రూపులు కడుతూ ఒక గ్రూపుపై మరోగ్రూపువారు ఫిర్యాదు చేసుకుంటున్నారు. ఇందులో కూడా కొన్ని స్టేషన్‌లలో సిబ్బంది సామాజిక వర్గాలవారీగా విడిపోవడం దురదృష్టకరం. మరీముఖ్యంగా హిందూపురం, పెనుకొండ, గోరంట్ల, రొద్దం, పోలీస్‌స్టేషన్లలో ఇలాంటివి అధికంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా హిందూపురం పట్టణంలో రెండు స్టేషన్లతోపాటు చిలమత్తూరు స్టేషన్‌లో ఇలాంటి గ్రూపులు ఉన్నట్లు ఆశాఖలోని కొంతమంది సిబ్బంది బహిరంగంగా చర్చించుకుంటున్నారు. అంతేకాక హిందూపురంలో ఉన్న సిబ్బందే తక్కువ. అందులో ఉన్నవారు సగం మంది ఖాకీ బట్టలు వేసుకోకుండా సివిల్ దుస్తుల్లోనే క్రైంపార్టీ, ఐడీపార్టీ, స్పెషల్‌పార్టీ అంటూ కాలయాపన చేస్తూ అధికారులను తప్పుదోవ పట్టిస్తూ నేరస్థులతో చేతులు కలుపుతున్నట్లు సామాన్యులు సైతం విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఉన్నతాధికారులు ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

శిథిలావస్థలో బడి



వర్షం కారణంగా పైకప్పు నుంచి నీరు కారుతున్న పాఠశాల గది

రొళ్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలం లక్కప్పనపల్లి ప్రాథమిక పాఠశాల కురుస్తున్న వర్షానికి కారుతోంది. స్థానిక పిల్లల తల్లిదండ్రులు ఎంఈఓ శ్రీధర్‌కు ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. ఆయన వెంటనే పాఠశాలకు చేరుకొని పాఠశాల పరిస్థితిని చూసి పిల్లలను దాదాపు ఒక కిలోమీటరు దూరంలో ఉన్న కె.బ్యాడిగెర పాఠశాలకు పంపారు. వెంటనే లక్కప్పనపల్లి పాఠశాలకు మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.



పెచ్చులూడిన పైకప్పు

పైకప్పు పెచ్చులూడుతున్న ఎంపీడీఓ కార్యాలయం

అమరాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గదులలో వర్షపునీరు నిలిచి పోయింది. భవనాల పైకప్పు నాణ్యత లోపించడంతో నిర్మాణానికి వాడిన ఇనుప కడ్డీలు తుప్పుపట్టి పెచ్చులు ఊడిపోయి పాడుబడిన భవనంలా కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి మండల పరిషత్ భవనానికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

అలరించిన సంగీత కచేరి



పూజలు నిర్వహిస్తున్న కర్ణాటక భక్తులు

పుట్టపర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటక భక్తులు సంగీత గాన కచేరీతో సందర్శకులను అలరింపజేశారు. పర్తియాత్ర పేరుతో రెండు వేలమంది భక్తులు ప్రశాంతినిలయం చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంతులో కథ, సంకీర్తన్ యుగకే అవతార పేరిట సంగీత కచేరి నిర్వహించారు. మధురమైన వాయుద్య గానంతో భక్తులను తన్మయం చేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు



మడకశిర, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో కూరగాయల పరిస్థితి కొనబోతే కొరివి, అమ్మబోతే అడవి అన్న చందంగా మారింది. భారీగా పెరుగుతున్న కూరగాయల ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. దసరా పండుగ సమయంలో కూరగాయల ధరలు కొద్దిగా తక్కువగా ఉండేవి. వారం రోజులుగా కురుస్తున్న బారీ వర్షాల కారణంగా మళ్లీ వాటి ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో వినియోగదారులు కూరగాయలు కొనాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. వర్షాలతో టమోటా, వంకాయలు, బీన్స్ తదితర కూరగాయల దిగుబడి తగ్గడంతో ధరలు పెరిగాయి. ప్రస్తుతం మార్కెట్‌లో టమోటా కిలో రూ.60, మిరపకాయలు రూ.80, బీన్స్ రూ200, వంకాయలు రూ.50, ఉల్లిపాయలు రూ.50 వరకూ పలుకుతున్నాయి. ఏది కొందామన్నా రూ.50నుంచి రూ.60లు పైనే ధర పలుకుతుండడంతో మార్కెట్‌లో కూరగాయల కోసం వచ్చిన వారు అరకొరగా కొనుగోలు చేసి వెనుదిరిగి వెళుతున్నారు.

బైపాస్ రోడ్డులో గుంతలతో నరకం



బైపాస్ రోడ్డులోని గుంతలతో వాహనదారుల ఇబ్బందులు

హిందూపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : హిందూపురం పట్టణంలోని పలు రహదారుల్లో మోకాళ్లలోతు గుంతలుపడి వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బైపాస్ రోడ్డులో కిలో మీటరు దూరానికి 20గుంతలకు పైగా ఉన్నాయి. ఇందులో రిలయన్స్ పెట్రోల్ బంక్, పట్టుగూళ్ల మార్కెట్, ధర్మపురం క్రాస్‌వద్ద గుంతలు అధికంగా ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల నందమూరి బాలకృష్ణ సొంత నిధులతో పట్టణంలోని కొన్నిచోట్ల గుంతలను పూడ్చారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు మరికొన్నిచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. వీటిని వెంటనే పూడ్చకపోతే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయని వాహనదారులు కోరుతున్నారు.

మల్లాపల్లి చెరువుకు మరమ్మతులు... గండ్ల పూడ్చివేత



గండి పూడ్చివేత పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈఈ లక్ష్మీనారాయణ

గోరంట్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపల్లి చెరువుకు పడిన గండిని శుక్రవారం నాటికి పూర్తిగా పూడ్చివేసి, వృధా అవుతున్ననీటిని అరికట్టారు. వారం రోజులక్రితం మల్లాపల్లి చెరువుకు తూము పక్కన గండి పడడంతో నీరు వృధా అవుతోంది. వెంటనే మంత్రి సవిత స్పందించడంతో టీడీపీ సీనియర్ నాయకులు వెంకటేశ్వరావు గండి పూడ్చివేత పనులను ప్రారంభించిన విషయం తెలిసిందే. తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి నరేష్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో గండిపడిన చోట పెద్ద ఎత్తున ఇసుక మూటలు వేసి, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తోలించి, గండిని పూడ్చివేత్తకు చర్యలు చేపట్టారు. గండి పూడ్చివేత పనులను శుక్రవారం ఇరిగేషన్ డిఇఇ లక్ష్మీనారాయణ పరిశీలించారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

అగళి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : అగళి మండలంలోని గ్రామాలలో చిల్లర దుకాణాలను శుక్రవారం హిందూపురం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తనిఖీ చేశారు. అనంతరం అగళి తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వం సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకులు పంపిణీ చేసే తూనికలకు సీలు వేశారు. తూనికల్లో ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా అని ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌పీ షాపు డీలర్లు కిరాణా వ్యాపారులు దుకాణదారులు ప్రజలకు అందించే నిత్యవసరాల పంపిణీలో ఎలాంటి వ్యత్యాసం ఉండకూడదన్నారు. తూకాల్లో మోసాలకు పాల్పడితే అలాంటి వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు తనిఖీ

పరిగి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో ఖరీఫ్ 2024కు సంబంధించి ఈ క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ చేశారు. శాసనకోట రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారిణి విజయభారతి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించి ఈ క్రాప్ నమోదు చేసిన రైతుల జాబితాను రైతుల సమక్షంలో చదివారు. అనంతరం హొన్నంపల్లి, శాసనకోట గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, వ్యవసాయ విస్తరణాధికారి లలితాపావని, సిబ్బంది హరీష్, రైతులు పాల్గొన్నారు.

భూ రీసర్వే చేస్తాం

పరిగి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బందారుపల్లి గ్రామంలో తహసీల్దార్ హసీనాసుల్తానా ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో మండల వ్యాప్తంగా భూసర్వే నిర్వహించారని, వాటిని మరలా పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. అనంతరం మోదా పంచాయతీలో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, ప్రవీణ్‌రెడ్డి, సోమప్ప, మాజీ ఎంపీటీసీ నారాయణరెడ్డి, పరిటాల శివ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

గుడిబండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండ గ్రామానికి చెందిన సువర్ణమ్మ(67) అనే మహిళ ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు శుక్రవారం ఏఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. కొంతకాలంగా సువర్ణమ్మ అనారోగ్యంతో బాధపడుతుండేదని, ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యచికిత్స పొందినా వ్యాధి నయం కాకపోవడంతో మనస్థాపానికి గురై ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు ఆయన తెలిపారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్యాలయంలో క్లీనింగ్

గుడిబండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మందలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఎంపీడీఓ గంగాధర్, ఈఓఆర్‌డీ నాగరాజునాయక్‌లు శుక్రవారం పరుగులు తీశారు. మందుబాబులకు అడ్డా పంచాయతీ కార్యాలయం అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకొని అక్కడ పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యాలయానికి తాళాలు వేయకుండా పంచాయతీ అధికారులు సక్రమంగా విధులు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శి అమరేష్, వీఆర్‌ఓ తిప్పేస్వామి, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉమాదేవి తదితరులకు సూచించారు. విధులకు డుమ్మాకొడితే శాఖ పరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.